

తాజ్ బంజారా చెరువు వద్ద జీహెచ్ఎంసీ సూచిక బోర్డు ఏర్పాటు చేసిన స్థలం

చెరువు పరిరక్షణకు మేయర్ ఆదేశాలు

- మట్టి డంప్ చేస్తున్న వారిని అడ్డుకున్న అధికారులు
- టిప్పర్లు సీజ్.. కేసు నమోదు

బంజారాహిల్స్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): చెరువులను రక్షించేందుకు ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తుండగా నగర నడిబొడ్డున ఉన్న తాజ్ బంజారా హోటల్ పక్కన ఉన్న చెరువును మట్టితో పూడ్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. రెండు రోజులుగా కొంతమంది మట్టిని డంపింగ్ చేస్తున్న క్రమంలో విషయం మేయర్ విజయలక్ష్మి దృష్టికి వెళ్లింది. దీనిపై స్పందించిన ఆమె జీహెచ్ఎంసీ అధికారులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని టిప్పర్‌లను సీజ్ చేసి డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. టౌన్‌ప్లానింగ్ సర్కిల్ 18 ఏసీపీ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు డంప్ చేసిన మట్టిని తొలగించి అక్కడ ప్రభుత్వ సూచిక బోర్డు ఏర్పాటు చేశారు.

వీధి దీపాల సమస్యను పరిష్కరించాలి

- అధికారులకు సూచించిన కార్పొరేటర్

వెంగళరావునగర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు ఫిర్యాదు చేయడంతో బుధవారం కార్పొరేటర్ దేదీప్య అధికారులతో సమావేశమయ్యారు. మధురానగర్ కాలనీలోని తన కార్యాలయంలో శేరిలింగంపల్లి జోన్ వీధి దీపాల విభాగం ఈఈ మల్లికార్జున్, డీఈ కవిత, ఈఈఎస్ఎల్ సంస్థ కోఆర్డినేటర్ నజీర్‌తో సమావేశమై సమస్యను పరిష్కరించాలని సూచించారు. డివిజన్ పరిధిలో సుమారు 500 పైచిలుకు వీధి దీపాలు వెలగడం లేదని, పాతవాటికి మరమ్మతులు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో సమస్యను త్వరలో పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మధురానగర్ సంక్షేమ సమితి సభ్యులు గంగారెడ్డి, హనుమంత్ రావు, స్థానిక నాయకులు వేణు, మాజీ కార్పొరేటర్ శ్యామ్ ముదిరాజ్, అర్జున్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మహాత్మానగర్‌లో స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

సమస్యలపై సీపీఎం ఇంటింటి సర్వే

బోరబండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకోవాలన్న సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక నాయకులు ప్రతి ఇంటికీ వెళ్తున్నారు. ఈ మేరకు రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎస్పీఆర్‌హిల్స్ మహాత్మానగర్‌లో పార్టీ జూబ్లీహిల్స్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నాయకుల బృందం పర్యటించింది. బస్తీ ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా తక్కువ సమయం ఉంటుందని, లో ప్రెషర్‌తో నీళ్లు వస్తున్నాయని ప్రజలు వారికి ఫిర్యాదు చేశారు. వీధి లైట్లు వెలగటం లేదని, విద్యుత్ తీగలు ఇళ్లకు ఆనుకొని ఉండటం వల్ల షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందని, విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్నదని.. ఈ సమస్యలను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రహ్మత్‌నగర్ డివిజన్ కార్యదర్శి జాకటి స్వామి, జోన్ నాయకులు టి.సాయి శేషగిరిరావు, డివిజన్ నాయకులు బి.దేవదాస్, బి.బాలయ్య, టి.భాగ్యరాజ్, పార్వతమ్మ, ఎ.ఆర్.నరసింహ, బి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు గంజాయి విక్రయదారుల అరెస్ట్

- ముగ్గురు వినియోగదారులు సైతం

బంజారాహిల్స్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్న ఐదుగురిని, కొనుగోలు చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. శ్రీనగర్‌కాలనీ పరిధిలోని నవోదయకాలనీలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో తనిఖీలు చేపట్టగా గంజాయి అమ్ముతూ ఓ యువకుడు దొరికాడు. అతడి ద్వారా అమ్మకం దారులందరినీ పోలీసులు పట్టుకున్నారు. గణపతి కాంప్లెక్స్‌లో నివసించే బీటెక్ విద్యార్థి గాదే సాయితేజస్వీ రెడ్డి, జీహెచ్ఎంసీ అసిస్టెంట్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఎ.శివాజీ, సాయికృష్ణ సదన్ అపార్ట్‌మెంట్‌లో నివసించే గార్లపాటి హేమ వంశీ, ఇందిరానగర్‌కు చెందిన పాలకుర్తి శ్రీకాంత్, ఎస్ఆర్‌నగర్‌కు చెందిన హేమసుందర్ నాగరాజులను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరితో పాటు గంజాయి వినియోగదారులైన జహంగీర్, ఉదయ్‌వెంకట్, దోమ రాకేష్‌లను సైతం అదుపులోకి తీసుకున్నారు. నిందితులు మహారాష్ట్రకు చెందిన అంజద్ వద్ద గంజాయి కొనుగోలు చేసి నగరంలో అమ్ముతున్నట్టు తేలింది. అంజద్ పరారీలో ఉన్నాడు. నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు వ్యక్తులపై దాడి.. నిందితులపై కేసు నమోదు

బంజారాహిల్స్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం లాక్కోవడంతో పాటు బీరు బాటిల్‌తో దాడి చేసిన ఐదుగురిపై కేసు నమోదైంది. పి.సాయిదుర్గా ప్రసన్నమూర్తి ఓ మొబైల్ కంపెనీలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతడు ఈ నెల 4న అర్ధరాత్రి స్నేహితులు సురేష్, సైదులతో కూర్చొని పంజాగుట్ట వైకుంఠద్వారం వద్ద మద్యం తాగుతున్నాడు. ఇంతలో ఓ వ్యక్తి వచ్చి ఇక్కడ ఏం చేస్తున్నారని ప్రశ్నించాడు. ప్రసన్న వద్ద ఉన్న ఎన్‌ఫీల్డ్ వాహనం లాక్కొని పారిపోతుండగా స్నేహితులు అతడిని వెంబడించారు. కొద్ది దూరం వెళ్లాక ఐదుగురు వ్యక్తులు కలిసి వీరిపై దాడి చేశారు. దీంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీలో ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం చంద్రబాబు ఘనతే

- టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి దశరథ్

నల్లకుంట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆ రాష్ట్ర ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ పేర్కొన్నారు. ఏపీలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించడమే ఇందుకు నిదర్శనమన్నారు. బుధవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులైన ఉపాధ్యాయులు, పట్టభద్రులు టీడీపీ అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించడం హర్షణీయమన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో టీడీపీ పూర్వవైభవం సంతరించుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేయండి

- తహసీల్దార్‌కు సూచించిన ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ వినాయకనగర్ బస్తీ పర్వతాంజనేయస్వామి ఆలయ పరిసరాల్లోని అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డిని ఆదేశించారు. బుధవారం వినాయకనగర్ బస్తీవాసులు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే దానంను కలిసి ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆక్రమణలను తొలగించడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించిన ఆయన, స్థానికులు వీర్‌వోలకు ఫిర్యాదు చేస్తే స్పందించడం మానేసి ఆలయానికి ఏర్పాటు చేసిన గేటును ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఫిలింనగర్‌లో పని చేస్తున్న వీఆర్‌వోలపై ఎన్నో ఆరోపణలు ఉన్నాయని, వారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అవసరం ఉందని, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకునేలా పోలీసులకు ఫిర్యాదు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని ఆదేశించారు.



వినాయకనగర్‌లో కబ్జాలపై ఎమ్మెల్యేకు వివరిస్తున్న బస్తీవాసులు

కమ్యూనిటీ హాల్‌కు వీడిన గ్రహణం

- కోర్టు కేసులు తొలగడంతో ప్రజలకు అందుబాటులోకి..

బంజారాహిల్స్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంగా నిరుపయోగంగా ఉన్న ఎల్లారెడ్డిగూడ పీజేఆర్ కమ్యూనిటీ హాల్‌కు గ్రహణం వీడింది. కోర్టు కేసులు తొలగడంతో జీహెచ్ఎంసీ అధికారుల అంగీకారంతో సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్ యాదవ్ తాళం తీసి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎల్లారెడ్డిగూడ జలమండలి కార్యాలయం పక్కనే ఉన్న పీజేఆర్ కమ్యూనిటీహాల్‌ను స్థానికులు శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వినియోగించుకునేవారు. దీని పర్యవేక్షణ బాధ్యతలను అప్పట్లో కొందరు బీఆర్ఎస్ నాయకులకు అప్పగించారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కమ్యూనిటీహాల్‌ను తమకు అప్పగించాలని స్థానికులు పట్టుబట్టారు. ఇందుకు జీహెచ్ఎంసీ అధికారులు ఒప్పుకున్నప్పటికీ బీఆర్ఎస్ నాయకులు కోర్టుకు వెళ్లారు. బస్తీతో సంబంధం లేని స్థానికేతరులకు కమ్యూనిటీహాల్ బాధ్యలు ఇవ్వడంపై జీహెచ్ఎంసీ అభ్యంతరం వ్యక్తం చేసింది. మరోవైపు కోర్టు కేసులతో బస్తీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన కోర్టు వెంటనే కమ్యూనిటీహాల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ తరఫున కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్ కమ్యూనిటీ హాల్‌ను తెరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కమ్యూనిటీహాల్‌పై ఇక నుంచి ప్రైవేటు వ్యక్తుల పెత్తనం ఉండబోదని స్పష్టం చేశారు. బస్తీవాసులు వినియోగించుకునేలా అన్ని సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మనోజ్ యాదవ్, సాయియాదవ్, మహేష్, హరికృష్ణ, విక్రంయాదవ్, శరత్ పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్ తాళాలు తీసిన అనంతరం కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్ తదితరులు

వాటర్ ట్యాంకర్స్ ఓనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ అధ్యక్షుడు జీవీజీ నాయుడు, వాటర్ ట్యాంకర్ల ఓనర్లు, డ్రైవర్లు తదితరులు

ఎర్రగడ్డ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వాటర్ ట్యాంకర్స్ ఓనర్లు, డ్రైవర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రేటర్ హైదరాబాద్ వాటర్ ట్యాంకర్ ఓనర్స్, డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీజీ నాయుడు అన్నారు. బుధవారం జలమండలి కార్యాలయం ఎర్రగడ్డ విభాగంలో వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాటర్ ట్యాంకర్ల ఓనర్లను ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఈ మేరకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జలమండలి విభాగం మేనేజింగ్ డైరెక్టర్, పోలీస్ కమిషనర్, అడిషనల్ కమిషనర్లకు అందజేసినట్లు తెలిపారు. అసోసియేషన్ సభ్యుడు మొహమ్మద్ జాఫర్ మాట్లాడుతూ.. వినియోగదారులకు అందించే వాటర్ ట్యాంకర్లలో ఐదు డొమెస్టిక్, ఒక కమర్షియల్ ట్యాంకర్లను సప్లయ్ చేయడం వల్ల తమకు నష్టాలు వస్తున్నాయని.. మూడు డొమెస్టిక్, ఒక కమర్షియల్ ట్యాంకర్ల సప్లయ్‌కి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం వేసవిలోనే తమ ట్యాంకర్లను వినియోగిస్తున్నారని, అలా కాకుండా ఏడాది పొడవునా తమ ట్యాంకర్లను వినియోగిస్తే తమకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చకుంటే ధర్నా చేస్తామని అని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.భవ్య చందు, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.మాధవరావు, జాయింట్ సెక్రెటరీ ఆసిఫ్ షేక్, కోశాధికారి కిరణ్ గుమ్మడి, పలువురు లారీ యజమానులు పాల్గొన్నారు.



తాగునీటితో బైక్‌ను శుభ్రం చేస్తున్న వ్యక్తి

తాగునీటితో బైక్ క్లీనింగ్.. వ్యక్తికి జరిమానా

హైదరాబాద్ సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు సరఫరా చేసే తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించిన వ్యక్తికి అధికారులు జరిమానా విధించిన ఘటన జూబ్లీహిల్స్‌లో బుధవారం చోటు చేసుకుంది. వాటర్‌బోర్డు ఎండీ అశోక్ రెడ్డి పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ ప్రధాన రహదారిపై వెళ్తుండగా రోడ్డు నంబర్ 78లో నీరు లీకేజీ అవుతున్నట్లు గమనించాడు. స్థానిక జీఎం హరిశంకర్‌ను పరిశీలించాలని ఆదేశించారు. దీంతో ఆయన మేనేజర్‌తో కలిసి అక్కడికి వెళ్లి చూడగా ఓ వ్యక్తి వాటర్‌బోర్డు సరఫరా చేసే నీటితో బైక్‌ను కడుగుతున్నాడు. ఈ విషయాన్ని ఎండీకి వివరించగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడికి నోటీసు అందించి రూ.వెయ్యి జరిమానా విధించారు. తాగునీటి కోసం ఉద్దేశించిన రక్షిత నీటిని వాహనాలను శుభ్రం చేయడానికి, గార్డెనింగ్, ఇళ్ల పరిసరాలను కడగడానికి వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాల కూల్చివేత

బంజారాహిల్స్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌టీఎల్‌లో పరిధిలోని స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదైంది. హకీంపేటలోని తుమ్మలకుంట చెరువును ఆనుకొని ఉన్న దేవాలయం పక్కన ఒమర్ పాషా అనే వ్యక్తి పక్కా నిర్మాణాలు చేపట్టాడు. ఈ విషయం జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందింది. వెంటనే చర్యలు చేపట్టాలని షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డికి ఆదేశాలు అందాయి. దీంతో ఆమె సిబ్బంది అక్కడకు వెళ్లి ఆక్రమణలు వాస్తవమేనని తేల్చి కూల్చివేశారు. అనంతరం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఒమర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లంబాడీల అభివృద్ధికి సహకరిస్తాం

రాంనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): లంబాడీల అభివృద్ధికి సహకారం అందిస్తామని ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, భోజు మహరాజ్ సేవాలాల్ హామీ ఇచ్చారు. బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గం ఆచరణీయమని వారన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని లంబాడీ తండాలో సంత్ సద్గురు సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఉత్సవాలు, మహాభోగ్ భండారు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంజారాల అభివృద్ధి, సంక్షేమం కోసం సేవాలాల్ మహరాజ్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. బంజారాలు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణిస్తూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాందాస్ తేజావత్, రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు జి.భరత్ గౌడ్, చిక్కడపల్లి సీఐ రాజునాయక్, బీఆర్ఎస్ నాయకులు శంకర్ ముదిరాజ్, ముచ్చకూర్తి ప్రభాకర్, వివేక్, బీజేపీ నాయకులు పూస రాజు, జైపాల్‌రెడ్డి, గడ్డం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పెళ్లి.. భర్త వేధింపులతో ఏడాదికే భార్య ఆత్మహత్య

బిట్స్‌పిలానీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఒకే కాలనీకి చెందిన యువతి, యువకుడు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అయితే ఏడాది గడవకముందే భర్త తాగుడుకు బానిసై భార్యను డబ్బులు ఇవ్వాలని వేధింపులకు గురి చేస్తుండడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆ వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముత్తుస్వామి కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ముత్తుస్వామి కాలనీలో దాసరి మహేష్, అతడి భార్య రమ్య ఉంటున్నారు. 2024 ఫిబ్రవరిలో వారు ప్రేమ వివాహం చేసుకున్నారు. పెళ్లి తర్వాత మహేష్ జులాయిగా తిరుగుతూ తాగుడుకు బానిసయ్యాడు. మద్యం కోసం డబ్బులు కావాలని భార్యను తరచూ వేధింపులకు గురిచేస్తున్నాడు.

ఈ క్రమంలో రెండు రోజుల క్రితం మద్యం తాగి వచ్చి రమ్యను కొట్టాడు. ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో వాళ్లు సర్ది చెప్పి ఇంటికి పంపించారు. ఈ నెల 4న మహేష్ తాగివచ్చి భార్యతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపానికి గురైన రమ్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంటికి వచ్చిన మహేష్ తలుపులు కొట్టినా తీయకపోవడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల వారి సహాయంతో తలుపులు పగులగొట్టి ఇంట్లోకి వెళ్లారు. అప్పటికే రమ్య ఉరేసుకుని మృతిచెందింది. అయితే తన కుమార్తె ఆత్మహత్య చేసుకోవడానికి భర్త వేధింపులే కారణమని రమ్య తల్లి ఐలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మహేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సైదయ్య వెల్లడించారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

8న 'న్యూరల్ ఏఐ గవర్నెన్స్' సదస్సు

బంజారాహిల్స్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీని సక్రమంగా ఉపయోగిస్తే సాంకేతికతలో ఎదురయ్యే భవిష్యత్తు సవాళ్లను అధిగమించవచ్చని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ నెల 8న ట్రిడెంట్ హోటల్‌లో నిర్వహించనున్న 'న్యూరల్ ఏఐ గవర్నెన్స్' సదస్సుకు హాజరుకావాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి, జినిసిస్ ఇన్ఫో ఎక్స్ అధినేత డాక్టర్ వినయ్‌కుమార్, న్యూరల్ ఏఐ అధినేత మోహన్‌కుమార్ బుధవారం మంత్రుల నివాసాల్లో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. మానవ జీవితంలో ఏఐ కీలకంగా మారిందన్నారు. దీనికి మెషీన్ లెర్నింగ్ తోడవడం వల్ల మరిన్ని అద్భుతాలు జరుగుతున్నాయన్నారు. ఏఐతో సంచలనాలు సృష్టించే దేశాల్లో భారత్ భాగం కావాలని కుమారస్వామి అన్నారు. 8న జరిగే సదస్సులో పలువురు టెక్ దిగ్గజాలు పాల్గొంటారని ఆయన వెల్లడించారు.

నేటి నుంచి పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు

వెంగళరావునగర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్, షేక్‌పేట మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, గురుకుల పాఠశాలల్లో నేటి నుంచి పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో సిలబస్ పూర్తి కాగా, పరీక్షలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యార్థుల్లో పరీక్షల భయం పోగొట్టేందుకు ప్రీ ఫైనల్ పరీక్షలు ఉపయోగపడతాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఖైరతాబాద్, సోమాజిగూడ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర నగర్, షేక్‌పేట, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ, బోరబండ, రహమత్‌నగర్ డివిజన్‌ల పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కాగా, పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 21 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు

విజయలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఎర్రగడ్డ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని విజయలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలు ఈ నెల 10వ తేదీతో ముగుస్తాయి. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా బుధవారం దేవాలయంలో జరిగిన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, విశ్వక్సేనారాధన, రక్షాబంధనం, మృత్సంగ్రహణము, ధ్వజాతి వాస హవనాధులు, అంకురారోపణం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేడుకల్లో దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.జనార్దన్, కోశాధికారి ఎంవీ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు గట్టు రంగాచారి, మేనేజర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

9న అఖిల భారత పద్మశాలీ సంఘం మహాసభ

చిక్కడపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ నెల 9న జరిగే అఖిల భారత పద్మశాలీ సంఘం మహాసభను జయప్రదం చేయాలని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డా. చిక్కా దేవదాసు విజ్ఞప్తి చేశారు. పద్మశాలీ సంఘం మహాసభ పోస్టర్‌ను బుధవారం చిక్కడపల్లిలోని చైతన్య వేదిక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిక్కా దేవదాసు మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో పద్మశాలీలు 12 శాతం ఉన్నారని, అధికారం సాధించుకోవడానికి ఈ మహాసభలు దోహదపడుతాయన్నారు. దేశ, రాష్ట్ర నలుమూలల నుంచి పద్మశాలీలు, చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ బాల్‌రాజ్, కె.సుదర్శన్‌రావు, శ్రీకాంత్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లివింగ్ రిలేషన్‌తో గర్భం దాల్చిన వైద్య విద్యార్థిని

- బాత్ రూమ్‌లో డెలివరీ.. ఆస్పత్రికి తరలింపు
- మరణించిన శిశువు.. కేసు నమోదు

రాంనగర్, మార్చి, 5(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో వైద్య విద్యార్థిని వేసిన తప్పటడుగులు ఆమె ఆరోగ్య పరిస్థితి దిగజారేలా చేశాయి. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. కర్ణాటకకు చెందిన యువతి నగరంలో ఉంటూ ఆయుర్వేద వైద్య విద్యనభ్యసిస్తూ ముషీరాబాద్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటోంది. పరిచయమైన యువకుడితో లివింగ్ రిలేషన్‌లో ఉన్న యువతి గర్భం దాల్చింది. ఈ సంగతి యువతి కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో యువకుడికి బ్రేకప్ చెప్పింది. కానీ, అప్పటికే 8వ నెల గర్భంతో ఉన్న యువతి తల్లిదండ్రులకు దూరంగా హాస్టల్‌లో ఉంటోంది. సమయం కన్నా ముందే నొప్పులు రావడంతో యువతి బాత్‌రూమ్‌కు వెళ్లి బలహీనమైన శిశువుకు జన్మనిచ్చింది. దీంతో శిశువు ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. విషయం తెలుసుకున్న హాస్టల్ నిర్వాహకులు అంబులెన్స్‌లో తల్లి, శిశువును గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శిశువు చనిపోగా యువతికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. వైద్యులు మెడికోలీగల్ కేసుగా నమోదు చేసుకోవడంతో పాటు పోలీసులకు సమాచారమందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ముషీరాబాద్ సీఐ రాంబాబు తెలిపారు.



సైఫాబాద్ శాఖ ఆధ్వర్యంలో రుణాలకు సంబంధించిన చెక్కులను అందిస్తున్న బ్యాంక్ ప్రతినిధులు



పంజాగుట్టలో రుణాల చెక్కులను అందిస్తున్న బ్యాంక్ అధికారులు

యూనియన్ బ్యాంక్ ఎంఎస్ఎంఈ ఔట్‌రీచ్ క్యాంప్

హైదరాబాద్ సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సైఫాబాద్ శాఖ ఆధ్వర్యంలో మచ్చింతల్ యూనియర్ బ్యాంక్ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ స్వర్ణ భారత్ కాంప్లెక్స్‌లో బుధవారం "మెగా ఎంఎస్ఎంఈ ఔట్ రీచ్ క్యాంప్" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 400 మంది ఎంఎస్ఎంఈ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 50 మంది ఎంఎస్ఎంఈ ఖాతాదారులకు రూ.100 కోట్ల మేర రుణాలను అందించారు. దేశవ్యాప్తంగా 157 యూనియన్ బ్యాంక్ శాఖల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అర్హత ఉన్న ఎంఎస్ఎంఈ సంస్థల నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముంబై ఎంఎస్ఎంఈ వర్టికల్ జీఎం జీకే సుధాకర్‌రావు సూచించారు. ఈ సదస్సులో రంగారెడ్డి ఇండస్ట్రియల్ సెంటర్ జనరల్ మేనేజర్ మందాడి శ్రీలక్ష్మి, బ్యాంకు జనరల్ మేనేజర్ ఆర్ఎల్ పట్నానాయక్, జోనల్ మేనేజర్ అజయ్ కుమార్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

పంజాగుట్టలో..

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పంజాగుట్ట రీజనల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ ఔట్‌రీచ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 3న బాలానగర్, 4న జీడిమెట్ల ప్రాంతాల్లో ఎంఎస్ఎంఈ ఔట్‌రీచ్ కార్యక్రమాలు నిర్వహించి రూ.194 కోట్ల మేర రుణాలు మంజూరు చేసినట్లు బ్యాంకు ఎంఎస్ఎంఈ విభాగం జాయింట్ డైరెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. దేశ వ్యాప్తంగా అన్ని యూనియన్ బ్యాంకు శాఖల్లో ఈ నెల 3 నుంచి 7 వరకు ఎంఎస్ఎంఈ ఔట్‌రీచ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న ఎంఎస్ఎంఈ నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్ టీవీ బాలకృష్ణ, ఎంఎస్ఎంఈ లోన్ పాయింట్ ఏజీఎం రాజు, పలు శాఖల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎండీ అశోక్‌రెడ్డి

మహిళా ఉద్యోగులకు వైద్యపరీక్షలు

హైదరాబాద్ సిటీ, మార్చి5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ నేపథ్యంలో వాటర్‌బోర్డు ఉద్యోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రి, వాటర్‌బోర్డు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎండీ అశోక్ రెడ్డి ప్రారంభించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో బుధవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించారు. ఈ శిబిరంలో వంద మందికిపైగా ఉద్యోగులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి వైద్యురాలు డా.ఎం. మాధవి, ఫైనాన్స్ సీజీఎం కేదారేశ్వరి, జలమండలి ఉమెన్స్ మినిస్టీరియల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు శైలజ, జనరల్ సెక్రటరీ బిల్కిస్ బాను, బోర్డు మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

● ఇన్‌స్పెక్టర్ నాగరాజు



తిరుమలగిరి మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్న నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్ నాగరాజు సూచించారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. స్థానికంగా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అగ్నిమాపక కేంద్రం అధికారులు, పోలీసులు సంయుక్తంగా అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రధానంగా పోలీస్ స్టేషన్ పరిధిలో పూరి గుడిసెలో నివాసం ఉంటున్న ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణ గురించి అవగాహన కల్పించామని తెలిపారు. ఈ ప్రమాదాలు జరుగుతున్నప్పుడు పోలీసులు సైతం వాటిని నివారించడానికి రక్షక్ వాహనంలో ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. ప్రమాదం నివారణలో అగ్నిమాపక సిబ్బంది సహాయ సహకారం అందిస్తుందని తెలిపారు. మరికొద్ది రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతాయని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అగ్ని ప్రమాదాలు జరగకుండా సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోనున్నారని తెలిపారు. గుడిసెలలో దీపాలు, గ్యాస్ పొయ్యిలను వెలిగించినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.

హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా బెనర్జీ నియామకం

పద్మారావునగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా బన్సీలాల్‌పేట్ డివిజన్ రామస్వామి కాంపౌండ్‌కు చెందిన పి.పి.బెనర్జీ నియమితులయ్యారు. ఈ మేరకు కమిషన్ జాతీయ అధ్యక్షుడు ఎండీ. ముజాయిద్ జారీ చేసిన నియామక పత్రాన్ని బుధవారం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీకాంత్‌రెడ్డి ఆయనకు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన జిల్లా ఉపాధ్యక్షుడు బెనర్జీ మాట్లాడుతూ, ఆడ్రియల్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం తద్వారా అనేక సామాజిక సేవలను నిర్వహిస్తున్నానని అన్నారు. సామాన్య ప్రజలకు మానవ హక్కుల పట్ల సరైన అవగాహన లేకపోవటంతోనే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

'జనతా'ను బలోపేతం చేస్తాం

● పార్టీ జాతీయ అధ్యక్షుడు చతుర్వేది



మాట్లాడుతున్న నవనీత్ చతుర్వేది

రాంగోపాల్‌పేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జనతా పార్టీని తెలుగు రాష్ట్రాలలో బలోపేతం చేస్తామని పార్టీ జాతీయ అధ్యక్షుడు నవనీత్ చతుర్వేది తెలిపారు. బుధవారం సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలలో పలు రాజకీయ పార్టీలలో వివిధ కారణాల వల్ల అసంతృప్త నాయకులను సంప్రదిస్తున్నామన్నారు. త్వరలో జనతా పార్టీ మరింత బలోపేతం అవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు తెలంగాణలో స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ వారిలో మమేకమయ్యే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో జనతా పార్టీ విధానమేమిటనే ప్రశ్నకు ప్రజల ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే లక్ష్యమని సమాధానం ఇచ్చారు. ఉపాధి అవకాశాలను కల్పించడమే ప్రధాన ఎజెండా అని తెలిపారు. కార్యక్రమంలో చంద్రప్రకాశ్ పాఠక్ పాల్గొన్నారు.

తాగునీటితో బైక్ క్లీనింగ్.. వ్యక్తికి జరిమానా

హైదరాబాద్ సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు సరఫరా చేసే తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించిన వ్యక్తికి అధికారులు జరిమానా విధించారు. బుధవారం వాటర్‌బోర్డు ఎండీ అశోక్ రెడ్డి పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ ప్రధాన రహదారిపై వెళ్తుండగా రోడ్డు నంబర్ 78లో నీరు లీకేజీ కావడం గమనించారు. ఈ విషయాన్ని జీఎం హరిశంకర్‌కు తెలిపారు. ఆయన అక్కడికి వెళ్లి చూడగా ఓ వ్యక్తి వాటర్‌బోర్డు సరఫరా చేసే నీటితో బైక్‌ను కడుగుతున్నాడు. ఈవిషయాన్ని ఎండీకి తెలపగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడికి నోటీసు అందించి రూ.వెయ్యి జరిమానా విధించారు. తాగునీటి కోసం ఉద్దేశించిన రక్షిత నీటిని వాహనాలు, గార్డెనింగ్, ఇళ్ల పరిసరాలను శుభ్రం చేసేందుకు వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

నేటి నుంచి టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు

వెంగళరావునగర్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్, షేక్‌పేట మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, గురుకుల పాఠశాలల్లో నేటి నుంచి పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో సిలబస్ పూర్తి కాగా, పరీక్షలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యార్థుల్లో పరీక్షల భయం పోగొట్టేందుకు ఈ ఎగ్జామ్స్ ఉపయోగపడతాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఖైరతాబాద్, సోమాజిగూడ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర నగర్, షేక్‌పేట, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ, బోరబండ, రహమత్‌నగర్ డివిజన్‌ల పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కాగా, ఈ నెల 21 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



మంగళసూత్రం చూపుతున్న అర్చకులు

ఎర్రగడ్డ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని విజయలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలు ఈ నెల 10వ తేదీతో ముగుస్తాయి. వేడుకల ప్రారంభం సందర్భంగా బుధవారం దేవాలయంలో జరిగిన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, విశ్వక్సేనారాధన, రక్షాబంధనం, మృత్సంగ్రహణము, ధ్వజాతి వాస హవనాధులు, అంకురారోపణం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేడుకల్లో దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.జనార్దన్, కోశాధికారి ఎంవీ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు గట్టు రంగాచారి, మేనేజర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రం వద్ద క్యూలో విద్యార్థినులు



సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

● ఇంటర్ పరీక్షలు ప్రారంభం

రెజిమెంటల్‌బజార్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభం అయ్యాయి. దీంతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ఇంటర్ మొదటి సంవత్సరం వారు తొలిరోజు సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష రాశారు. ఎగ్జామ్ ఉదయం 9 గంటలకు ప్రారంభం కానుండటంతో 8 గంటలకే ఎగ్జామ్ సెంటర్‌లకు చేరుకున్నారు. సికింద్రాబాద్‌లో కీస్ కాలేజ్, సెయింట్ మేరీస్, ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొన్ని సెంటర్‌ల వద్ద ఆల్ ది బెస్ట్ అంటూ ట్రాఫిక్ పోలీసులు ప్లకార్డులను ప్రదర్శించారు. మొదటి రోజు కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను దగ్గర ఉండి పరీక్ష కేంద్రంలోకి పంపించారు.

చికెన్ అమ్మకాలు ఢమాల్

బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ అమ్మకాలు భారీగా పడిపోయాయి. బేరాలు లేక చికెన్ షాపులు బోసిపోతున్నాయి. బర్డ్ ఫ్లూ ప్రచారంతో దాన్ని తినేందుకు జంకుతున్నారు. మటన్, చేపలు, నాటుకోళ్లు కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీన్ని ఆసరాగా తీసుకున్న వ్యాపారులు రేట్లు పెంచి దోపిడీ చేస్తున్నారు. బోయిన్‌పల్లితో పాటు అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

- గిరాకీ లేక దుకాణాలు వెలవెల
- బర్డ్ ఫ్లూ ప్రచారమే కారణం
- ఆఫర్లు ప్రకటించినా ఆసక్తి చూపని జనం
- చేపలు, మటన్ షాపుల వద్ద మాంసాహారుల క్యూ
- రేట్లు పెంచిన వ్యాపారులు
- దోపిడీకి గురవుతున్న ప్రజానీకం



బోయిన్‌పల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రాంనగర్‌లోని చేపల మార్కెట్‌కు జనం తరలి వెళ్తుండడంతో పాటు బోయిన్‌పల్లిలోని సెంటర్‌పాయింట్, బోయిన్‌పల్లి మార్కెట్, పుల్లారెడ్డి బంగ్లా, మల్లారెడ్డి గార్డెన్, మర్రి రామ్‌రెడ్డి కాలనీ రోడ్డులలోని చేపల మార్కెట్, మటన్ షాపుల్లోను రద్దీ కనిపిస్తుంది. కొన్నిచోట్ల మధ్యాహ్నం లోపు నో స్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయి. దీంతో ఇదే అవకాశంగా వ్యాపారస్తులు ధరలు పెంచేశారు. గతంలో కిలో మటన్ రూ. 600 నుంచి 750 వరకు ఉండగా, ఇప్పుడు రూ.800 నుంచి వెయ్యి వరకు పలుకుతుంది. బొచ్చె కిలో రూ.80 ఉండగా 120 - 160కి చేరింది. రవ్వ రూ.100 నుంచి రూ. 150-200, కొరమీను రూ.450 నుంచి రూ.800, రొయ్యలు రూ.350 నుంచి 500లకు సైజ్‌ను బట్టి రూ.600, అపోలో ఫిష్ రూ.350 నుంచి 500-600లకు పెరిగింది.

నష్టపోతున్నామంటూ ఆందోళన

గత నెల నుంచి 70 శాతం అమ్మకాలు పడిపోయాయని బోయిన్‌పల్లిలోని చికెన్ షాపుల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిరోజులుగా క్రమంగా అమ్మకాలు తగ్గుతుండడంతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. అయితే అమ్మకాలు తగ్గుతున్నా చికెన్ ధరల్లో పెద్దగా ఎలాంటి మార్పు ఉండడం లేదు. కొందరు షాపుల నిర్వాహకులు 10 శాతం నుంచి 20 శాతం వరకు డిస్కౌంట్‌లు ఇస్తున్నా జనం అటువైపు వెళ్లడం లేదు. ఈ సమయంలో చికెన్ ధరలు తగ్గిస్తే బర్డ్ ఫ్లూ ఉందనే కారణంతో రేట్లు తగ్గించారని జనం అనుకుంటారు. దీంతో అమ్మకాలు ఇంకా తగ్గే అవకాశం ఉంది. అందుకే ధరలు పెంచకుండా తగ్గించకుండా పౌల్ట్రీ వ్యాపారులు జాగ్రత్త లు తీసుకుంటున్నారని వ్యాపార వర్గాలు, సప్లయర్స్ అంటున్నారు.

హోటల్స్, రెస్టారెంట్లలో తగ్గిన ఆర్డర్లు

చికెన్ షాపులే కాదు హోటల్స్, రెస్టారెంట్లలో కూడా చికెన్ ఐటమ్స్ ఆర్డర్లు తగ్గిపోయాయి. సాధారణ రోజుల్లో ఆర్డర్లలో 70 శాతం చికెన్ సంబంధిత వెరైటీలే ఉంటాయని, కానీ ఇప్పుడు వాటి సేల్స్ తగ్గాయని నిర్వాహకులు చెబుతున్నారు. ఎక్కువగా చికెన్ బిర్యానీపై ఎఫెక్ట్ పడిందంటున్నారు. జొమాటో, స్విగ్గీ వంటి ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్స్‌లో వచ్చే ప్రతి 30 ఆర్డర్లలో 20 చికెన్ వంటకాలే ఉండేవి. ప్రస్తుతం ప్రతి 30 ఆర్డర్లలో మూడు నాలుగే చికెన్ సంబంధిత ఫుడ్ ఆర్డర్లు ఉంటున్నాయి.



బోయిన్‌పల్లిలో చేపలు, రొయ్యల విక్రయ ప్రాంతం వద్ద కనిపిస్తున్న రద్దీ

రెస్టారెంట్లకు తగ్గిన కస్టమర్లు

ఎక్కువ మంది రెస్టారెంట్లకు వెళ్లి లంచ్, డిన్నర్ చేస్తుంటారు. మధ్యాహ్నం నుంచే రెస్టారెంట్లు కస్టమర్లతో కిటకిటలాడుతుంటాయి. కానీ బర్డ్ ఫ్లూ ప్రచారంతో వినియోగదారుల సంఖ్య కూడా తగ్గిందని రెస్టారెంట్ల నిర్వాహకులు చెబుతున్నారు. రెస్టారెంట్లు, హోటళ్లకు వచ్చి తినేవారి సంఖ్య 20 నుంచి 30 శాతం పడిపోయిందంటున్నారు.

సీఫుడ్, మటన్ బిర్యానీ ఆర్డర్లు ఎక్కువయ్యాయి



బర్డ్ ఫ్లూ భయం లేక ముందు ఎక్కువ సంఖ్యలో చికెన్ ఐటంలకు సంబంధించిన ఆర్డర్‌లు వస్తుండేవి. ప్రస్తుతం ఎక్కువ సంఖ్యలో సీఫుడ్ ఆర్డర్‌లు, మటన్ బిర్యానీ, వెస్ బిర్యానీ, ఫిష్, ప్రాన్స్ బిర్యానీల ఆర్డర్‌లు వస్తున్నాయి.

నర్సింగ్, బోయిన్‌పల్లి జొమాటో డెలివరీ బాయ్

అభివృద్ధి పనులకు సహకరించాలి

- ఎమ్మెల్యే శ్రీగణేష్
- బోర్డు ముఖ్యకార్యనిర్వహణాధికారి మధుకర్ నాయక్‌తో ప్రత్యేక సమావేశం



సమావేశమైన కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్, ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

సికింద్రాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు చేపట్టనున్నామని, దీనికి బోర్డు తరఫున, రక్షణ శాఖ తరఫున పూర్తి సహాయ సహకారాలు అందించాలని శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ అన్నారు. కంటోన్మెంట్ బోర్డు ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్‌తో కలిసి ఆయన సికింద్రాబాద్ కంటోన్మెంట్ బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గతంలో బోయినపల్లిలో కొంత స్థలాన్ని నేతాజీ స్కూల్ కోసం లీజుకు ఇచ్చారన్నారు. ప్రస్తుతం విద్యార్థులు లేకపోవడంతో ఆ స్కూల్ మూతపడినట్లు తెలిపారు. ఆ స్థలాన్ని వెనక్కి తీసుకుని, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించాలన్నారు. తద్వారా ఎంతో మంది పేదలు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించకోగలుగుతారని అన్నారు. పికెట్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో షెడ్డు నిర్మించి, మహిళలకు శిక్షణ కేంద్రం కోసం కేటాయించాలని కోరారు. బొల్లారంలోని జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లో సీవరేజి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా మధుకర్ నాయన్ స్పందించారు. కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ చట్టప్రకారం నేరం

వెట్టిచాకిరీ నివారణ ప్రతీఒక్కరి బాధ్యత అని కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో దివ్య దిశ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వెట్టిచాకిరీ, మానవ అక్రమ రవాణ అవగాహన' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో స్వేచ్ఛగా, గౌరవంగా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. వెట్టిచాకిరీ, మానవ అక్రమ రవాణా చట్టరీత్యానేరమన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

సంజీవయ్య నగర్ కాలనీ వాసుల వినతి

మారేడుపల్లి, మార్చి5(ఆంధ్రజ్యోతి): 'కంటోన్మెంట్ ప్రాంతంలో చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న మాకు న్యాయం చేయాలని' సంజీవయ్య నగర్ కాలనీ వాసులు కోరారు. బుధవారం పికెట్‌లోని క్యాంపు కార్యాలయంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసి వారు వినతి పత్రం సమర్పించారు. చట్ట ప్రకారం హరిజన, గిరిజనుల భూములు ప్రభుత్వం సేకరించిన నేపథ్యంలో 1:3 నిష్పత్తిలో పరిహారం చెల్లించాలన్నారు. పునరావాసంలో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, జనరల్ సెక్రటరీ యావరావు, అసోసియేషన్ సభ్యులు సత్యనారాయణ, శ్రీధర్, గౌరీ శంకర్, సతీష్ ఉన్నారు.

సాయన్న సేవలు మరువలేనివి

● సనత్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్ ● మాజీ ఎమ్మెల్యే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన తలసాని



సికింద్రాబాద్: బాలికకు కేక్ తినిపిస్తున్న తలసాని

సికింద్రాబాద్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ శాసనసభ్యుడిగా దివంగత సాయన్న చేసిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం రసూల్‌పురాలోని సిల్వర్ కంపౌండ్‌లో బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయన జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ 30 సంవత్సరాలపాటు శాసనసభ్యుడిగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి సాయన్న ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. డబుల్ బెడ్ రూమ్, తాగునీరు తదితర సదుపాయాల కల్పన కోసం అవిరళ కృషి చేశారన్నారు. రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్, నర్సింహముదిరాజ్, ఆకుల హరికృష్ణ, కుమార్ ముదిరాజ్, శ్యాంరెడ్డి, దేవరాజ్, శ్రీనివాస్, ధన్‌రాజ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ కూడా వేడుకల్లో పాల్గొన్నారు. సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

మారేడుపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. బుధవారం వెస్ట్ మారేడుపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ముషీరాబాద్ మండలం బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి ఐదు, షాదీముబారక్ రెండు చెక్కులను పంపిణీ చేశారు. పేద, మధ్య తరగతి కుటుంబాలలో ఆడబిడ్డ వివాహం ఆర్థికంగా ఎంతో భారంతో కూడుకుందని పేర్కొన్నారు. వారికి కొంత చేయూతను ఇవ్వాలనే ఉద్దేశంతో గత కేసీఆర్ ప్రభుత్వం రూ. లక్ష 116లు ఆర్థిక సాయం అందించే గొప్ప కార్యక్రమం ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, రెవెన్యూ అధికారులు, మాజీ కార్పొరేటర్ మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ నేతలు వెంకటేషన్ రాజు, ఆకుల హరికృష్ణ, లక్ష్మీపతి, ప్రేమ్ కుమార్, మహేష్ కుమార్ యాదవ్, గజ్జెల శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.



మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బొమ్మ నరేంద్ర తదితరులు

మహాసభలను విజయవంతం చేయాలి

బౌద్ధనగర్, మార్చి5(ఆంధ్రజ్యోతి): నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో ఈనెల 9న నిర్వహించనున్న పద్మశాలి మహాసభలను విజయవంతం చేయాలని గ్రేటర్ వారాసిగూడ పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొమ్మ నరేంద్ర పిలుపునిచ్చారు. బుధవారం వారాసిగూడలో సంఘం సభ్యులతో కలిసి ఆయన గోడపత్రికను ఆవిష్కరించారు. తమ కులస్తుల హక్కుల సాధన కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున తరలిరావాలని కోరారు.

ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



షాహనూర్ బాబా (ఫైల్)

అడ్డగుట్ట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన షాహనూర్ బాబా (22) ఒక ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈనెల 1న ఇంటి నుంచి బయటికి వెళ్లిన అతను తిరిగి రాలేదు. మరుసటి రోజు బాబా ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో కుటుంబసభ్యులు వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో తల్లి షమీమ్ బేగం ఫిర్యాదు మేరకు బుధవారం అదృశ్యం కేసును పోలీసులు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే

బోరబండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకోవాలన్న సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక నాయకులు ప్రతి ఇంటికీ వెళ్తున్నారు. ఈ మేరకు రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎస్పీఆర్‌హిల్స్ మహాత్మానగర్‌లో పార్టీ జూబ్లీహిల్స్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నాయకులు పర్యటించారు. బస్తీ ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా తక్కువ సమయం ఉంటుందని, లో ప్రెషర్‌తో నీళ్లు వస్తున్నాయని ప్రజలు ఫిర్యాదు చేశారు. వీధి లైట్లు వెలగటం లేదని, విద్యుత్ తీగలు ఇళ్లకు అనుకొని ఉండటం వల్ల షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్నదని.. ఈ సమస్యలను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో సీపీఎం రహ్మత్‌నగర్ డివిజన్ కార్యదర్శి జాకటి స్వామి, జోన్ నాయకులు టి.సాయి శేషగిరిరావు, డివిజన్ నాయకులు బి.దేవదాస్, బి.బాలయ్య, టి.భాగ్యరాజ్, పార్వతమ్మ, ఎ.ఆర్.నరసింహ, బి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.